# విచ్ఛిత్తి

సింగరాజు లింగమూర్తి

తనను మైసూరు కేటాయించారన్న ఆఫీసు ఆర్డరు చూడంగానే ' అరే - అల్లా' అంటూ అహ్మదు కుర్చీమీద మెడవాల్చేశాడు. తోటి గుమాస్తాలమంతా కంగారుగా చుట్టూ చేరాము. అహ్మదుకు నిలువు గ్రుడ్లు పడిపోయాయి. నోట మాటలేదు. ఆఫీసుకారులోనే అతని మృతదేహాన్ని ఇంటికి చేరవేశాము. అహ్మదు మీద ఆధారపడివున్న పదిమందీ గొల్లుమని ఏడ్చారు. అతని అంత్యక్రియలకు ఇంట్లో ఎర్రని ఏగానీ కూడా లేకపోతే ఆఫీసు వాళ్ళమే చందాలు వేసుకున్నాము. ఏండ్ల తరబడి ఒకే ఆఫీసులో కలిసి మెలిసి పనిచేసిన వాళ్ళం కాబట్టి అహ్మదును సమాధి చేస్తుంటే మాకు తెలియకుండానే కన్నీళ్ళు కార్చేశాం కొందరం. ఇప్పటికీ అహ్మదు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, అతని మాటలు మనస్సులో మసులుతూంటాయి. అతని రూపం కళ్ళముందు కదులాడుతూ ఉంటుంది.

బక్కపల్చగా పొడుగ్గా ఉంటాడు. పాలిపోయిన ముఖం లోని ముడతలు, లోతుకు దించుకొని పోయిన కళ్ళూ దైన్యాన్ని సూచిస్తుంటాయి. తెలుపు నలుపూ కల నేతరంగులో పెరిగిన గడ్డం, బొత్తాలూడి రంగు మాసిపోయిన షేర్వానీ చేతుల నుంచి వ్రేలాడే దారపు పోగులు - కాళ్ళకు సగం తెగిపోయిన టైరు చెప్పులు - అహ్మదు బ్రతుకు కష్టాల సుడిగుండంలో కొట్టుకుపోతున్నట్ల నిపిస్తుంది.

అసలు ఎప్పుడో ఒకప్పుడు గుండె ఆగిపోయి అహ్మదు చస్తాడనుకునే వాణ్ణి. ఏ కష్టం వచ్చినా ఉప్పెనలా వచ్చేది. ఆ ఉప్పెనలో అహ్మదు ఎక్కడికి కొట్టుకుపోతాడో ననిపించేది. ఏ అవమానం వచ్చినా మనిషిని నిలువునా క్రుంగదీసేది. ఆ అవమాన భారంతో కుంచించుకుపోయిన అహ్మదు ఒకటి రెండు రోజుల దాకా తేరుకోలేక పోయేవాడు. ఈ కష్టాలకు, అవమానాలకు అహ్మదు గుండె బండబారి పోయింది. అంత బండబారి పోయిన అహ్మదు గుండె మైసూరుకు కేటాయించారన్న ఆఫీసు ఆర్డరు చూడంగానే ఆగిపోవడం అబ్బురంగానే వున్నా, అది సమ్మెట పోటులా తాకివుంటుంది. దాంతోపాటే బాధ్యతలు కూడా ఘోషిల్లడంతో ఉక్కిరి బిక్కిరై అహ్మదు గుండె బ్రద్దలై ఉంటుంది.

అహ్మదు పుట్టడం నవాబుల వంశంలోనే పుట్టాడు. అతని తాతలు, ముత్తాతలు, తండ్రి నవాబుల దర్జాతోనే బ్రతికారు. చివరికి అహ్మదు కర్మమే ఇట్లా కాలింది. తండ్రి అతనికి మిగిల్చిందల్లా ఒక ఇల్లు. అదీ తాకట్టులోనే వుంది. ఇకపోతే తండ్రి చేసిన ఉపకారమల్లా అహ్మదును పట్టభద్రుణ్ని చేయడమే. మొదట్లో, మంచికీ చెడ్డకీ పిల్లనిచ్చిన తండ్రి ఆదుకునేవాడు. పలుకుబడీ - డబ్బూ కలవాడు కాబట్టి మామగారే అహ్మదుకు ఉద్యోగం కూడా సంపాదించి పెట్టాడు. ఆ

ఆధారం కూడా ఎంతో కాలం అతనికి లేకపోయింది. ఆ మామగారు కాస్త కళ్ళు మూసేసరికి అహ్మదు బ్రతుకు బజారున పడింది. 'నీ బ్రతుకు నీవు బ్రతుకు' అన్నారు బావమరుదులు.

అహ్మదు కుటుంబం ఆర్థికంగా చితికిపోయినా అతని వంశాన్ని అంటి పెట్టుకు వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలు మాత్రం విడిపోలేమన్నాయి. కాదు - ఆ కుటుంబం విడిచి పెట్టలేక పోయింది. తన వంశగౌరవాన్నీ, పరువు ప్రతిష్ఠల్నీ కాపాడుకోవాలన్న పెనుగులాటలో అహ్మదు బ్రతుకు దుర్భరమైపోయింది.

ఒక రోజు ఆఫీసులో తొందరపనుండి ఒక ముప్పావు గంట ముందరే బయలుదేరాను. ఇరవై, ముప్పై గజాల దూరంలో ఆఫీసు ముందర అహ్మదు కనిపించాడు. అతణ్ణి కదలనీయకుండా ముగ్గురు కాబూలీవాళ్ళు చుట్టూ నిలబడ్డారు. ఒకడు అహ్మదు గుండెను పిండుతున్నట్టుగా గుండెల మీద వున్న షేర్వానీని పిడికిలిలో బిగించాడు. అతనికి చెరోప్రక్క నిలబడిన వాళ్ళు ఏవో పరుషంగా మాట్లాడుతున్నారు. నన్ను ఆ క్షణంలో ఆఫీసు ముందు చూసేప్పటికి అహ్మదు ముఖం వెలతెలపోయింది. ఆత్మాభిమానం గొడ్డలితో నరికినట్లయిందేమో కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. నన్ను చూడలేక అహ్మదు తలవంచేసుకున్నాడు. 'అయ్యో-పాపం' అనిపించినా చేసేది లేక లోపలికి వెళ్ళిపోయాను.

నన్ను చూడటానికి ముఖం చెల్లకనేమో అహ్మదు ఆఫీసు ఫైళ్ళలో తలదూర్చి కూర్చున్నాడు. పనిలోవున్నా రోజూ ఏదో ఒకటి కల్పించుకొని మాట్లాడేవాడల్లా, ఆరోజు నా ముందరి నుంచి పోవాల్సిన పనివున్నా తప్పించుకు పోతున్నాడు. 'లంచి టైంలో' అంతా వెడుతుంటే అహ్మదు మాత్రం సీటులో కదలకుండా కూర్చున్నాడు. రోజూ అందరికంటే ముందు లంచికి బయలుదేరేవాడు ఆ రోజు కదలకపోయేప్పటికి నాకే ఎలాగో అనిపించింది. అతని వాలకం చూస్తే ప్రొద్దుట భోజనం చేసినట్టు కూడా అనిపించలా. బయటికి అడుగు పెట్టిన వాడినల్లా మళ్ళీ లోపలికి వెళ్ళి "అహ్మదుభాయ్ - లే, కాంటీనుకు వెడదాం" అన్నాను. ఏమనుకున్నాడో ఏమో, నా ముఖంలోకి ఒకసారి చూసి మారు మాట్లాడకుండా బయలుదేరాడు.

ఇద్దరం కాంటీనులో ఓ మూలగా కూర్చున్నాం. అతణ్ణి మాటల్లోకి దింపి ఏవో కులాసా కబుర్లతో మనస్సుకు ఉల్లాసం కలిగిస్తేనే కాని అహ్మదు ప్రొద్దుటి వ్యవహారం మరచిపోడనిపించింది. కాని అతను చిన్నబుచ్చుకొని, ముభావంగా వుండటంతో నే నే మాట కదిపినా అతను ఉత్సాహం కనబరచలేదు.మేము కాంటీనులో ఉండగానే అహ్మదు కొడుకు పన్నెండవాళ్ళ వాడు వచ్చాడు. కుర్రాడు పసిమిఛాయలో అందంగా బాగానే వుంటాడు. సరైన పోషణ లేకనేమో చిక్కిపోయివున్నాడు. కాంటీనులోంచి ఐదారు పెద్దసైజు డబుల్ రొట్టెలు, ఇంకేవేవో కట్టించి కొడుకుచేత ఇంటికి పంపాడు అహ్మదు.

'ఏం - ఇంట్లో ఎవరికైనా జబ్బుగా ఉందా?' అన్నాను.

'రోజూ ఇది మామూలే. మధ్యాహ్నం పిల్లలకు తినటానికేమీ ఉండదు' అన్నాడు అహ్మదు.

'అందుకని రోజూ కాంటీను నుంచి పంపిస్తే బిల్లు బోలెడంత కాదూ ?'

'అవుతుంది. ఏం చేయను మరి. ఆకలితో పిల్లలేముంటారు?' అతని సమాధానం నాకంతగా నచ్చలేదు.

'అదికాదు అహ్మదుభాయీ, ....ఈ కాంటీనుకు తగలేసే డబ్బుతో ఇంట్లోనే ఏదైనా చేయిస్తే అందరూ తినచ్చు. ఇంత డబ్బు కూడా కాదుగా అప్పుడు.'

'ఏం చెప్పను భాయ్ - నా పాట్లు. పెద్దపిల్లలంతా కాలేజీలకు, స్కూళ్ళకు వెళ్ళిపోతారు. అసలే అనారోగ్యంగా వుండే మాముసలిది మిగతా పిల్లలకు చేసిపెట్టలేక సతమత మౌతుంది. కాంటీనుకు ప్రతి నెలా రూ.80 అవుతుంది. ఇంతెందుకు అవుతుందంటావేమో - సాధారణంగా నేను ప్రొద్దుటిపూట భోజనం చేసిరాను. ఒకవేళ చేసివచ్చినా కడుపుకు చాలీ చాలక తినిరావడంతో ఆకలికి ఆగలేక కాంటీనులో ఏదో ఒకటి తినేస్తాను' అన్నాడు అహ్మదు.

కాంటీనుకు 80 రూపాయలు అవుతుందంటే నిజంగా నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆఫీసులో అందరికంటే ఎక్కువగానే అహ్మదుకు కాంటీను బిల్లు అవుతుందని ఒకటి రెండు సార్లు విన్నాను కాని ఇంత ఎక్కువ అవుతుందని అనుకోలేదు. అతనికి జీతం, అలవెన్సులతో సహా 200 రూపాయలు వస్తుంది. కాంటీను బిల్లు, ఇన్సూరెన్సు, కోఆపరేటివ్ కటింగులూ అన్నీ పోగా అతని చేతికి 80, 90 రూపాయలు వస్తాయనుకుంటాను. ఈ స్వల్ప మొత్తంతో అంత పెద్ద సంసారాన్ని ఎలా ఈదుతున్నాడో, పిల్లలకు చదువు సంధ్యలు ఎలా చెప్పిస్తున్నాడో, రాబందుల్లా పీక్కుతినే కాబూలీవాళ్ళకు వడ్డీలెలా కడుతున్నాడో నాకర్థం కాలేదు.

'మీకు ఆశ్చర్యంగానే వుంటుంది. ఏమిటో బ్రదర్, నా మనస్సు చెడిపోయింది. ఒక్కోసారి నేనేం చేస్తున్నానో నాకే తెలియదు. జీవితం మీద విరక్తీలేదు, అనురక్తీలేదు. ఒక్కోసారి వంటరిగా కూర్చొని భోరున ఏడ్వాలనిపిస్తుంది. కాని అలా ఒంటరిగా వున్నప్పుడు ఏవేవో పిచ్చి ఆలోచనలు వస్తుంటాయి. ఆ ఆలోచనల్లోనే కళ్ళు చెమ్మగిలుతాయి. ఆ చెమ్మగిల్లిన కళ్ళతో నిస్సత్తువుగా మత్తుగా పడుంటాను. ఎప్పుడు నిద్రపడుతుందో నాకే తెలియదు' అన్నాడు అహ్మదు.

ఒక్కోసారి ఆలోచనలు మనిషిని పీల్చి పిప్పిచేసి ఏ మాత్రం సత్తువ లేకుండా చేస్తాయి. ఆ నిస్సత్తువతో అలాగే పడుకొని వుంటాడు. ఇక అతనిలో ఆలోచించే శక్తికూడా ఉండదు. ఆ నిస్సత్తువతో వెంటనే నిద్ర కూడా రాదు. అన్ని ఇంద్రియాలూ పనిచేస్తున్నట్లే వుంటాయి. కాని ఏమీ చేయలేని వాడిలా మత్తుగా పడివుంటాడు. అహ్మదు అవస్థకూడా అంతే అయినుంటుందను కుంటూ లేచాను. ఇద్దరం మళ్ళీ ఆఫీసులో అడుగుపెట్టాం.

ఆరోజు నుంచీ అహ్మదుతో నాకు మరింత సన్నిహితత్వం ఏర్పడింది. అహ్మదు కుటుంబాన్ని ఉద్ధరించగల స్తోమత నాకు లేకపోయినా, చేయగల సహాయ మేమైనా వుంటే చేయాలన్న బుద్ధిపుట్టింది. అతని కుటుంబ వివరాలు అతనివల్లనే గాక, ఇతరులవల్ల కూడా విన్నాను.

అహ్మదుకు తొమ్మిదిమంది సంతానం. ప్రతి తండ్రి తన సంతానానికి విద్యాబుద్ధులు చెప్పించి ఉన్నతిలోకి తీసుకురావాలని కుతూహలపడతాడు. కొందరికి పరిస్థితులు అనుకూలిస్తాయి. కొందరికి పరిస్థితులు అనుకూలించక కుతూహలం కుతూహలంగానే ఉండిపోతుంది. అహ్మదును ఒకందుకు మాత్రం అభినందించక తప్పదు. పరిస్థితులకు ఎదురొడ్డి తన పిల్లలకు ఉన్నత విద్యలు చెప్పిస్తున్నాడు. 'నేను వాళ్ళకి ఆస్తిపాస్తులేం ఇవ్వకపోయినా, ఇంత చదువైనా చెప్పిస్తే వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతుకుతారుకదా' అనేవాడు.

'ఆడపిల్లలకు అంతంత పెద్ద చదువులు చెప్పిస్తే రేపు వాళ్ళు నీకేం ఒరగబెడతారు? ఎలాగూ ఓ అత్తింటి కోడలు కావాల్సిందేగా' అనేవారు కొందరు.

'వాళ్ళు నాకేం ఒరగబెట్టక పోవచ్చు. కాని వాళ్ళ సంసారాలకు వాళ్ళు ఒరిగించుకోవడమే నాకు కావాల్సింది. కట్నాలు - కానుకలు ఇచ్చి నేను మంచి సంబంధాలు తేలేను. అలాగని ఏ రిక్షావాడికో ముడిపెట్టి నా వంశ గౌరవాన్ని మంటగలుపుకోలేను. ఒక డిగ్రీవుంటే దాన్ని చూసైనా ఏ మంచి సంబంధమైనా కుదరచ్చు. వాళ్ళకిష్టమైతే ఉద్యోగం చేయించుకుంటారు. లేకపోతే లేదు. అసలు ఏ సంబంధమూ రాదే అనుకుందాం - డిగ్రీవుంటే ఏదైనా మంచి ఉద్యోగంలో ఉండి ఇతరులపై ఆధారపడకుండా బ్రతకవచ్చుగా' అంటాడు అహ్మదు.

అహ్మదు వున్న పరిస్థితుల్లో మన తెలుగువాళ్ళ మెవరైనా వుంటే, చదివిన చదువు చాలని, వాళ్ళనీ వీళ్ళనీ ఆశ్రయించి, నానా గడ్డి కరచి ఏ చిన్న ఉద్యోగంలోనైనా సరే చేర్పించేస్తాము. గొడ్డుతోక బెత్తెడేనన్నట్టు ఆ ఉద్యోగానికి ఎదుగూ - బొదుగూ ఉండదు. నలుగురూ నాలుగురాళ్ళు సంపాదించుకొస్తే గుంభనగా కుటుంబాన్ని గడుపుకోవచ్చుకదా అనుకుంటాము. అహ్మదు ఈ వాదాన్ని ఒప్పుకోడు. అందుకే అతని బ్రతుకు బజారుకెక్కింది అంటారు. 'నా బ్రతుకు బజారుకు ఎక్కితే ఎక్కింది - నా పిల్లల భవిష్యత్తు బాగుంటేచాలు' అనేవాడు అహ్మదు.

ఓసారి నేనేదో పనిమీద హిమాయత్ నగర్ వెళ్ళి వస్తున్నా. ఓ ఇంటి గుమ్మంలో అహ్మదు కనిపించి, "ఇదే మా ఇల్లుభాయీ, రండి లోపలికి" అంటూ చెయ్యిపట్టుకొని లోపలికి తీసుకువెళ్ళాడు. ఇద్దరం కూర్చొని మాట్లాడుతుండగా "బాబా" అన్న మధుర స్వరంతోపాటు ఓ సుందర సుకుమార మూర్తి తెర తొలగించి నన్ను చూసి తటిల్లతలా తెరవెనక్కి మాయమైంది. 'ఆ బేటియా ఆ' అన్నాడు. ఆ లావణ్యమూర్తి అందాలొలికిస్తూ లోపలికి వచ్చి సిగ్గు దొంతరలతో 'ఆదాబర్సే' అంది. ఆముగ్ధ సౌందర్యాన్ని కళ్ళతో పుణుకుతూ "ఆదాబర్సే" అన్నాను. అహ్మదు నన్ను పరిచయం చేశాడు. ఆ పరిచయంలో నేనో మామూలు గుమాస్తా ననేకాక, కథకుడిననీ, పేరు మోసిన పత్రికలలో నా రచనలు వస్తుంటాయనీ, రేడియోకు కూడా రచనలు చేస్తుంటాననీ తెలియజేశాడు. 'మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా ఉంది ...... ఇప్పుడే వస్తా' నని ఉర్దూలోనే అంటూ, లోపలికి వెళ్ళింది. ముంతాజ్ బి.యస్.సి చదువుతున్నదనీ, తెలివైనదవడం వల్ల స్కాలర్ షిప్పు కూడా దొరికిందనీ అహ్మదు చెప్పాడు. ఇంతలో ముంతాజ్ మెరుపుతీగెలా లోపలికి వచ్చింది. ఆమె వెనకే నౌకరు ట్రేలో టీ తీసుకువచ్చి మా ముగ్గురికీ ఇచ్చాడు. నావంక చూస్తూ 'లీజియే' అంది ముంతాజ్. ఆ స్వరంలో ఏదో మధురిమ ప్రతిఫలించింది. సోగలుతీరిన ఆకాటుక కళ్ళలో ఏదో వింతశోభ తొణికిసలాడింది.

'మిమ్మల్ని ఒక విషయం అడుగుదామని చాలా రోజుల నుంచి అనుకుంటున్నా మూర్తీసాబ్' అన్నాడు అహ్మదు.

'నాదగ్గర సందేహమెందుకు అహ్మదుభాయ్ - చెప్పు' అన్నాను.

'ముంతాజ్ ప్రాంతీయ భాషల్లో తెలుగు తీసుకుంది. మీరు ఆమెకు కాస్త సహాయం చేస్తారేమో అడుగుదామనుకున్నాను. కాని ఇంతకుముందు ఆఫీసులో ఒకరడిగితే ట్యూషన్ చెప్పనని మీరనడం విని నేను అడగటానికి సంకోచించాను.' అహ్మదు మాటల్లో కొంత లౌక్యం లేకపోలేదనిపించింది. నేనేమంటానో వినాలన్న కుతూహలం కనబరచింది ముంతాజ్.

'నిజమే ఆ మాట. సాయంత్రాలప్పుడు ఏవో సభలకీ, సమావేశాలకి వెడుతుంటానుగా, ట్యూషన్లు చెప్పే కాలంలో ఏ రచనైనా చేస్తే ఆమాత్రం గిట్టుబాటు కాకపోదనే ఉద్దేశంతో ట్యూషన్లు ఒప్పుకోలేదు. మీ అమ్మాయికి కావాలంటే సాయంత్రంపూట ఓగంట సేపు ఎలాగో వీలుచేసుకొని చెబుతాలే' అన్నాను. నా సమాధానానికి అహ్మదూ, ముంతాజ్ ఎంతో సంతోషం, కృతజ్ఞత వెలిబుచ్చారు.

అనాటి నుంచే అహ్మదు కుటుంబంతో కూడా నాకు పరిచయమూ, సన్నిహితత్వమూ సానుభూతి ఏర్పడ్డాయి. అహ్మదు పిల్లలంతా చురుకైన వాళ్ళే. పెద్దకూతురు మాసునాబేగం మెడిసన్ చదువుతున్నది. ముంతాజ్ రెండో కూతురు, మూడో సంతానం వహీద్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మిగతా పిల్లలు వయస్సువారీగా చదువుతున్నారు.

సాయంత్రం ఆఫీసు వదలంగానే సరాసరి అహ్మదు ఇంటికి వెళ్ళేవాణ్ణి ముంతాజుకు తెలుగు పాఠాలు చెప్పడానికి. ఆ కుటుంబంలో పిల్లల దగ్గరి నుంచి పెద్దల దాకా ఎంతో గౌరవం చూపేవారు. అహ్మదు ఆఫీసు వదలంగానే ఇంటికి వచ్చేవాడు కాదు. అతనికేవో పనులున్నాయంటూ ఎక్కడికో వెళ్లేవాడు. అతనికేం పనులున్నాయో అడగడం దేనికని పూరుకునేవాణ్ణి.

రోజూ నేను వెళ్ళంగానే ముంతాజ్ బిస్కట్లు, టీ తెప్పించి ఇచ్చేది. వద్దంటే ఏమనుకుంటుందోనని మొదట్లో తీసుకునేవాణ్ని. అహ్మదు పడే ఇబ్బందులు నాకు తెలుసుకాబట్టి అనవసరంగా ఆ కుటుంబానికీ ఖర్చు కలిగించడం దేనికనిపించి ఓ రోజు ముంతాజుతో 'ఎందుకి వన్నీ -వద్దు' అన్నాను. ' ఏం?' కళ్ళల్లోకి చూస్తూ అంది ముంతాజ్.

'అబ్బే-మరేం లేదు. నేను ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు ఎలాగూ హోటలుకు వెళ్ళి వస్తాను. మళ్ళీ అనవసరంగా ఎందుకూ' అన్నాను. ముంతాజ్ కాస్త చిన్నబుచ్చుకున్నట్లనిపించింది. 'అయితే తీసుకోరా' అంది. ఆ మాటల్లో కొంత ప్రాధేయత ధ్వనించింది. నేనేం మాట్లాడలేదు. 'తీసుకోకపోతే నా మీద ఒట్టే' అంది. ఏమిటీ ఒట్లు అనుకుంటూ ముంతాజ్ వంక చూశాను. ఎప్పుడూ చిరునవ్వులు చిందే గులాబీ రెక్కల్లాంటి ఆమె పెదవుల్లో చలనం కనిపించలేదు. ముఖంలో చిరుకోపం నర్తించింది. ముంతాజ్ నామీద ఎందుకింత చనువు తీసుకుంటున్నదోనని ఆలోచిస్తూ బిస్కట్లు, టీ తీసుకొని 'ఊ - సరేనా' అన్నాను. ముంతాజ్ పుస్తకం తెరుస్తూ తృప్తిగా నవ్వింది.

నెల గడిచింది. ఆ రోజు నేను ముంతాజ్‌కు పాఠం చెప్పి, ఇంటికి వెళ్ళడానికి బయలుదేరబోతుంటే ఆమె 'ఇవి తీసుకోండి' అంటూ రెండు పదిరూపాయలనోట్లు అందించబోయింది. ఆశ్చర్యంతో 'ఎందు' కన్నాను. 'ట్యూషన్ ఫీజు' అందామె.

'అయితే నేను రేపటి నుంచి మానేస్తాను' అన్నాను. ముంతాజ్ తెల్లబోయింది. క్షమించాలి ... నాకేం అర్థం కావడం లేదు' ఆందోళనగా అంది.

'మరేంలేదు. ఆ డబ్బును ఇంకే అవసరానికైనా ఉపయోగించు' అంటూ బయటికి వచ్చేశాను.

• • •

ఓ రోజు స్నేహితులతో కలిసి మొదటాట సినిమాకు వెళ్ళాను. హాల్లోంచి ఇవతలికి వచ్చేప్పటికి పదిగంటలైంది. అంతా తలోదారీ వెళ్ళాల్సిన వాళ్ళం కాబట్టి అక్కడే నిలబడి ఏమిటో

మాట్లాడుతున్నాము. ఇంతలో వెనుక నుంచి 'రిక్షాహోనా క్యాసాబ్' అన్న కంఠం వినిపించింది. అది పరిచయమైన గొంతుగా అనిపించి వెనక్కు తిరిగాను. లోతుకు దించుకుపోయిన కళ్ళు, బూడిద గుమ్మడిరంగులో పెరిగిన గడ్డం.... నాకళ్ళను నేను నమ్మలేక పోయాను. నా ముఖం చూడడంతోనే, రిక్షా కావాలా అని అడిగిన వాడల్లా, మారుమాటాడకుండా ముందుకు త్రొక్కుకుంటూ వెళ్ళిపోయాడు. సందేహంలేదు. అహ్మదే అతను. టోపీకీ మారుగా తలపాగా చుట్టాడు. పంట్లానికి బదులు కాకినిక్కరు తొడిగాడు. షేర్వానీ స్థానంలో చినిగిన చొక్కావుంది. తన నెవరూ గుర్తుపట్టకుండా ఉండటానికనేమో వేషం మార్చివేశాడు. తనకు తెలిసిన వారు కనపడకుండా ఉండటాని కనేనేమో మారు మూలలలో రిక్షా నడుపుతున్నాడు.

ఆ మరునాడు నన్ను చూడటానికి మనస్కరించకనేమో, అహ్మదు ఆఫీసుకు సెలవు పెట్టాడు. ఏవో పనుల మీద వుండి రెండు సాయంత్రాలు మామూలుగా ముంతాజ్‌కు పాఠాలు చెప్పడానికి పోలేదు. ఈ మూడు రోజులూ అహ్మదు ఆఫీసుకు రాకపోవడంతో నాలో ఆందోళన ఎక్కువైంది. మర్నాడు సాయంత్రం ఇంటికి వెళ్ళి సంగతేమిటో కనుక్కుందామనుకున్నా. కాని ఆ రోజు సాయంత్రం ఆఫీసు పనిమీద మరో చోటుకి వెళ్ళవలసి రావడంతో పోలేక పోయాను. ఆ మరునాడు ఆదివారమే కాబట్టి వెళ్ళచ్చుకదా అనుకున్నాను.

ఆదివారం నాడు ప్రొద్దున కాఫీ తాగి ఏమిటో వ్రాసుకుంటూ కూర్చున్నా. ఇంతలో ఇంటి ముందు పరదాకట్టిన రిక్షా ఆగింది. తలెత్తి చూసేప్పటికి పరదా తొలగించుకొని ముంతాజ్ చరచరలోపలికి వచ్చి 'తొందరగా రండి మాస్టర్ సాబ్' ఆదుర్దాగా అంది. 'మీ బాబా ఆఫీసుకు రావడంలేదేం' అన్నాను.

'బాబాకు నాల్గురోజుల నుంచి జ్వరం పేలిపోతున్నది. రోజా మీరు వస్తారేమోనని ఎదురుచూసేదాన్ని. మిమ్మల్ని బాబా చూడాలంటున్నాడు. రారూ' అంది. తండ్రికి జ్వరం తగులుతున్నదన్న దిగులువల్లనో, నిస్సహాయతవల్లనో ముంతాజ్ కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

'ఛా.... ఇంత మాత్రానికే కన్నీళ్ళు పెట్టుకుంటున్నావా...మీ బాబాకేం భయంలేదు. నీవు పద ముంతాజ్... నేను స్నానం చేసి వస్తాను' అన్నాను. 'నిజమేనా?' అన్నట్టు చూసింది ముంతాజ్.

స్నానం చేశాక, ఎందుకైనా మంచిదని ఆ క్రింతం రోజే రేడియో చెక్ మారిస్తే వచ్చిన పాతిక రూపాయలు జేబులో వేసుకొని ముంతాజ్ ఇంటికి వెళ్ళాను.

అహ్మదుకు జ్వరం బాగానే పేలిపోతున్నది. 'మందు తీసుకుంటున్నావా అహ్మదు భాయ్' అన్నాను.

'ఆ ... ఏదో తీసుకుంటున్నా' నీరసంగా అన్నాడు. ముంతాజ్ ఒక కాగితం అందించింది. అందులో డాక్టర్ ఏవో ఇంజక్షన్లు వ్రాశాడు. పరిస్థితి అర్థమైంది. జేబులోంచి రెండు పది నోట్లు ఒక అయిదునోటూ తీసి 'వహీదు వుంటే తెప్పించు' అంటూ ముంతాజ్ కిచ్చాను.

'ఇవి నీకు తిరిగిరావేమో' అన్నాడు అహ్మదు.

'మరేం పర్వాలే' దన్నాను.

అహ్మదుతో కొంతసేపు మాట్లాడి లేచి రాబోతుంటే 'అనాటి సంగతి ముంతాజ్‌కు చెప్పకుభాయీ' అన్నాడు అహ్మదు. అతని చూపుల్లోని ప్రాధేయత, కంఠంలోని జీర నన్ను

కలచివేశాయి. 'ఎంత ఆత్మాభిమానం' అనుకుంటూ ఇవతలికి వచ్చేప్పటికి చదువుల గదిలోంచి ముంతాజ్ పిలిచింది.

'పాఠాలు చెప్పటానికి రావడం లేదేం? నేనేం తప్పు చేశాను' అంది ముంతాజ్. నేను వెంటనే సమాధానం చెప్పలేక పోయాను.

'అవునులెండి - నాకేం అధికారముంది అడగటానికి. నేనేమైనా డబ్బిచ్చి చదువుకునేదాన్నా ఏమైనానా' నిష్ఠూరంగా అంటున్నది ముంతాజ్.

'ముంతాజ్' అని గట్టిగా అరచినట్టున్నాను. ముంతాజ్ గజగజలాడి పోయింది. ఆమెను మందలిద్దామన్న ఉద్దేశం కూడా నాలో లేదు. అప్పుడుపడే మానసిక బాధను, అతను పడే శ్రమనూ నన్నూ అర్థం చేసుకోలేక పోయిందన్న విచారమూ, కోపమే నా గొంతునలా పలికించి వుంటుంది. ఒక నిముషం వరకూ ఆమె మాట్లాడలేకపోయింది.

'క్షమించండి ... ఏదో చికాకులో అన్నాను' కళ్ళల్లో నీళ్ళు నింపుకుంటూ అంది ముంతాజ్.

' మీ బాబా రోజూ ప్రొద్దుపోయి ఇంటికి ఎందుకు వస్తున్నాడో తెలుసా?' అన్నాను.

'ఇంటికివస్తే ఏమీతోచదని ఏక్లబ్బులోనో, స్నేహితుల తోనో కాలక్షేపం చేస్తుంటానని బాబా చెప్తుండేవాడు' ఆ ప్రశ్న నేనెందుకు వేస్తున్నానా అన్నట్టుగా వున్నాయి ముంతాజ్ చూపులు.

'కాదు - పచ్చి అబద్ధం'

'మరి ఏం చేస్తున్నాడంటారు?'

'మిమ్మల్ని చదివించడానిక్కోసం, పోషించడానిక్కోసం, వచ్చే జీతం రాళ్ళు చాలక, తాటి ప్రమాణంగా పెరిగిన అప్పులకు వడ్డీలు కట్టడానికి చాలక రాత్రిళ్ళు 11 గంటల దాకా రిక్షా నడుపుతున్నాడు. ముంతాజ్ - రిక్షా' ఆవేశంగా అనేస్తున్నాను.

'రిక్షా.... మా బాబా రిక్షా నడుపుతున్నాడా? ... ఛీ ... ఛీ నేనెంత పాపిష్టిదాన్ని మాస్టర్ సాబ్' అంటూ ముంతాజ్ వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

'మీరు విలాసంగా రిక్షాల్లో కాలేజీలకు వెళ్ళడానికి రోజూ ఇచ్చే డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయనుకున్నావు ముంతాజ్. మీ బాబా రాత్రిళ్ళు రిక్షా నడిపి సంపాదించిన డబ్బులే. మీ బాబాను గురించి నీవు కానీ, మాసూనా కానీ, వహీద్ కానీ ఎప్పుడైనా ఆలోచించారూ?'

'ఇక చెప్పకండి మాస్టర్‌సాబ్' అంటూ ముంతాజ్ కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది.

ఈ సంగతి చెప్పి ముంతాజ్‌ను ఏడిపిద్దామనుకోలేదు. ఆమెలో చైతన్యం కలిగించి ఆమె ద్వారా మాసూనా, వహీదులకు కూడా చైతన్యం కలిగించాలనే నా ఉద్దేశం. కాని ముంతాజ్ సుకుమార హృదయం భరించలేకపోయింది.

'ఏడవకు ముంతాజ్ ఏడవకు' అంటూ అప్రయత్నంగానే ఆమె తల నిమిరాను. కొంతసేపటికి ఆమె తేరుకుంది.

'ఎక్కడైనా నాకో ఉద్యోగం చూసిపెట్టండి మాస్టర్‌సాబ్ - రేపటి నుంచి కాలేజీ మానేస్తాను' అంది ముంతాజ్. 'సరే' నంటూ లేచాను.

అప్పుడు ఆ జ్వరంతో పదిరోజులక్కానీ తేరుకోలేదు. నేనా రోజు ముంతాజ్‌తో అన్నమాటలు ఆమె హృదయంపై బాగానే పనిచేశాయి. ఉద్యోగంలో చేరి, తండ్రికి ఆసరాగా ఉందామన్న పట్టుదల

అమెలో ఎక్కువైంది. మెడిసన్ చదువుతున్న మాసూనా, ఇంజనీరింగ్ చదువుతున్న వహీదా వాళ్ళ కోర్సులు పూర్తి అవుతేనే గాని మరేపని చేయడానికి అవకాశం లేదనుకున్నారు. నా పలుకుబడి కూడా కొంత ఉపయోగించేటప్పటికి ముంతాజ్‌కు ఒక కార్యాలయంలో ఉద్యోగం దొరికింది. అహ్మదు మొదట్లో కూతురు ఉద్యోగానికి ఒప్పుకోకపోయినా, నా ప్రోద్బలం, ముంతాజ్ పట్టుదల అతణ్ణి ఒప్పింపచేశాయి.

* * *

అహ్మదు మామూలుగా ఆఫీసుకు వస్తూనే వున్నాడు. వడ్డీ వసూళ్ళకోసం కాబూలీవాళ్ళు అతణ్ణి పీడిస్తూనే వున్నారు. కాంటీను బిల్లు మామూలుకు భిన్నం లేకుండానే ఉంటుంది. ముంతాజ్ ఉద్యోగంలో చేరడం ఫలితంగా అహ్మదుకు రాత్రిళ్ళు రిక్షా నడపడం తప్పింది. అదైనా ముంతాజ్ పట్టుదలవల్లనే.

ఇంతలో రాష్ట్రాల పునర్విభజన వచ్చింది. రాష్ట్రంలోని మహమ్మదీయోద్యోగులను కొందరిని మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు కేటాయిస్తారన్న వార్త ముస్లిం ఉద్యోగులలో కొంత ఆందోళన కలిగించింది. తనను ఏ ప్రాంతానికి కేటాయిస్తారోనని అహ్మదు భయపడసాగాడు.

అప్పులతో, దైనందిన సమస్యలతో అహ్మదుకు అసలు మతిస్తిమితం లేకుండా పోయింది. ఈ భయం అతనిలో మరింత అశాంతిని కలిగించింది.

"నేనిక్కడి నుంచి కదలాలంటే మాటలా భాయ్... పదివేల రూపాయలు అప్పు తీర్చందే అవతలికి కాలు పెట్టలేను. సంసారాన్ని కదిలించేట్టు లేదు. పిల్లల చదువులకు ఇబ్బంది కలుగుతుంది" అన్నాడు అహ్మదు.

'ఈ గడ్డన పుట్టాం - ఈ గడ్డన పెరిగాం. కలలో కూడా అనుకోలేదు– ఈ గడ్డను వదలిపెట్టి పోవాల్సి వస్తుందని' అన్నారు కొందరు.

'ఎవరు ఏ ఉద్యోగాలు చేస్తున్నా ఇంతవరకూ మా కుటుంబం సమిష్టిగా వుంది. నన్ను మైసూరుకు, నాకొడుకుని బొంబాయికి, తమ్ముణ్ని మరోచోటుకు, నాకూతుర్ని ఏ ఔరంగాబాదుకో కేటాయిస్తే కుటుంబంలో 'విచ్ఛిత్తి' కలుగుతుంది. ఒకడు తక్కువ సంపాదించినా, ఒకడు ఎక్కువ సంపాదించినా ఇప్పుడు సర్దుకుపోవడానికి వీలవుతున్నది. రేపలా కుదరదుగా', అన్నాడొక పెద్ద కుటుంబీకుడు.

'సంకుచిత భావాలతో మూలసూత్రానికే దెబ్బ తగులుతుంది. పునర్విభజన వల్ల తాత్కాలికంగా కొన్ని ఒడుదుడుకులు, ఇబ్బందులు కలగడం సహజం. ఈనాడు మనకు కావాల్సింది విశాల దృక్పథం' అన్న నాయకుల బోధనలు కొందరిలో పనిచేశాయి. కానీ ఇవేవీ రచ్చకెక్కలేదు. ఎవరికి వారు - పలుకుబడి గలవారు ఈ గడ్డమీద ఉంటానికే ప్రయత్నాలలోకి దిగారు. వాళ్ళలాగానే అహ్మదూ ప్రయత్నించాడు. తన ఈతిబాధల్ని అధికారుల ముందు చెప్పుకొని ప్రాథేయపడ్డాడు. కాళ్ళూ కడుపులూ పట్టుకొని బ్రతిమాలుకున్నాడు. వాళ్ళను మెప్పించి అనుగ్రహం పొందటానికి కూడా పూనుకున్నాడు.

కొన్ని కార్యాలయాలలో కేటాయింపులు ప్రకటింపబడ్డాయి. గోరుచుట్టుపై రోకలిపోటులా క్రొత్తగా ఉద్యోగంలో చేరిన ముంతాజ్‌ను ఔరంగాబాద్‌కు కేటాయించడంతో అహ్మదుకు తన

విషయంలో ఏమౌతుందోనని మరింత ఆందోళన పడ్డాడు. ఎలాగయినా సరే, తను ఇక్కడికే వేయించుకుంటానికి గట్టిగా ప్రయత్నించాలి', అన్న సంకల్పం మరింత బలపడింది. 'నన్నిక్కడికే కేటాయిస్తే ముంతాజ్ చేత ఉద్యోగానికి రాజీనామా ఇప్పిస్తాను భాయీ' అన్నాడు.

ఈ దుమారంలో అప్పులను వసూలు చేసుకోడానికి తహ తహలాడ సాగారు - మార్వాడీలు, కాబూలీవాళ్ళు. కిరాణా దుకాణదార్లు కూడా అప్పులివ్వడం మానివేశారు. ఈ వత్తిడివల్ల అహ్మదులాటి ఋణగ్రస్తులకు దినదిన గండమైపోయింది బ్రతుకు. తాకట్టులో వున్న అహ్మదు ఇంటిని స్వాధీనపరుచుకోడానికి మార్వాడీ పథకం వేశాడు. 300 అప్పిచ్చి వెయ్యిరూపాయలకు ప్రాంసరీనోటు వ్రాయించుకున్న కాబూలీవాడు కోర్టులో దావా తెస్తానని బెదిరిస్తున్నాడు. 'మూలిగే నక్క మీద తాటికాయపడి' నట్టు అహ్మదు భార్యకు క్షయ అని డాక్టర్లు నిర్ణయించారు. ఇవన్నీ అహ్మదు మెదడును తినివేశాయి. ఈ దిగుళ్ళతో మనిషి కట్టెలా తయారయ్యాడు. 'ఎందుకుభాయీ బ్రతకడం' అని పెదిమి విరిచేవాడు.

రోజులు గడుస్తున్నాయి. ఉన్నట్టుండి అహ్మదు ప్రవర్తనలో కొంత మార్పు కనిపించిం-ది. ఎప్పుడూ పరాగ్గా వుండేవాడల్లా అందరితో కల్పించుకొని చలాకీగా నవ్వుతూ మాట్లాడడం మొదలు పెట్టాడు. ' ఈ మార్పుకు కారణమేమిటా' అని ఆలోచించాను. దీపం ఆరిపోయేముందు 'గప్' మని ఎగిరినట్టు కాదుగదా- అహ్మదు జీవితం అన్న ఆలోచనవచ్చి అటువంటి పాడు ఆలోచన కలిగినందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

ఓరోజు సాయంత్రం టాంకుబండ్ మీదికి షికారుకని వెళ్ళి వస్తున్నాను. అప్పటికే ప్రొద్దుపోయింది. ఒక బెంచీమీద అహ్మదు కనిపించాడు. నన్ను చూడంగానే ఎప్పుడూ ఎంతో ఆప్యాయంగా పలుకరించేవాడల్లా ఆ రోజు నన్ను చూడనట్టు తల ప్రక్కకు తిప్పుకున్నాడు. 'కొంపతీసి హుస్సేన్‌సాగర్‌లో పడటానికి రాలేదుకదా' అన్న అనుమానం వేసి నేనే పలుకరించాను. ఎప్పుడూ చొరవగా మాట్లాడేవాడల్లా ముక్తసరిగా సమాధానమిచ్చి, 'నేనిందులో పడి చావడానికి రాలేదు భాయీ, ఒక పెద్దమనిషితో మాట్లాడుదామని వచ్చా' నన్నాడు. నేనుండటానికి కూడా అతనికి ఇష్టం వున్నట్టు కనిపించకపోవడం వల్ల 'సరే నేవెడుతున్నా' నంటూ ముందుకు సాగాను. కొన్ని గజాలు వచ్చేప్పటికి ఒక కారులో ముంతాజ్ ముఖం దీపాల వెలుగులో తళుక్కున మెరిసింది. ప్రక్కనే ఒక అధికారి ఆమె భుజం మీద చెయ్యి వేసి కులాసాగా మాట్లాడుతున్నాడు. నాకెక్కడలేని ఆశ్చర్యమూ విచారమూ కలిగాయి. 'ఛీ.. ఛీ.. అహ్మదు ఎంత నీచానికి ఒడిగట్టాడు. చదువూ సంస్కారమూ గల ముంతాజ్ ఈ పాడుపనికి ఎలా ఒప్పుకుంది? ఇదా అహ్మదులోని మార్పుకు కారణం' అనుకుంటూ నడుస్తున్నాను. అతని మీద జాలి, విచారమూ పడటం కంటే మరేం చేయగలుగుతాను.

అన్ని కార్యాలయాలలోనూ కేటాయింపుల జాబితాలు ప్రకటింపబడ్డాయి. అహ్మదు ఆశాసౌధం కుప్పలా కూలిపోయింది. ఏ అధికారిని నమ్ముకున్నాడో ఆ అధికారి కూడా ఏమీ చేయలేక పోయాడు. తనను మైసూరు కేటాయించినట్టు ఆఫీసు ఆర్డరు చూడంగానే తనకళ్ళను తాను నమ్మలేకపోయివుంటాడు అహ్మదు. తనకు ఆశచూపిన అధికారి భయంకర కాముకుడిలా

కనిపించివుంటాడు. తనకోసం శీలం అమ్ముకున్న ముంతాజ్, క్షయతో తీసుకుంటున్న భార్య కళ్ళ ముందు దీనంగా కనిపించివుంటారు. ఇంటిని తాకట్టు పెట్టుకున్న మార్వాడీ మాటలు, దావా తెస్తానన్న కాబూలీవాడి బెదిరింపూ చెవుల్లో ఘోషిల్లివుంటాయి. వీటన్నిటితో ఉక్కిరిబిక్కిరై నీరసించిపోయిన అప్పాదు గుండె ఆగిపోయి వుంటుంది. ఏ పిల్లల భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉండాలని కాంక్షించి రిక్షా కూడా నడిపాడో ఆ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆలోచన కూడా కలగకుండానే పాపం అప్పాదు కళ్ళు మూసేశాడు.

✸

ఆంధ్రపత్రిక, హేవిళంబి సంవత్సరాది సంచిక 1957-58.